క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



చంద్రేడులో కొలువైయున్న వేంకటేశ్వరస్వామి

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైయున్న పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సంపర వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో ప్రాచీన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం శనివారం సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామి వారికి పంచామృతాభిషేకం, తులసి పూజ, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



సీతానగరం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ చైతన్య

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఏవీకే చైతన్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో సమీక్షా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటింటా సర్వే నిర్వహించి, జ్వర బాధితులుంటే ఆసుపత్రికి వెళ్లేలా చూడాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందించాలని సూచించారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సలహాలు ఇవ్వాలన్నారు. వచ్చే నెల 17న జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్లు జి.దైవకృప, కె సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ నందీశ్వరరావు పాల్గొన్నారు.

చినుకు పడితే ముంపే..



గాదరాడలో ప్రధాన రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీరు

మధురపూడి: చినుకు పడితే చాలు రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. గాదరాడ గ్రామంలో చాలాచోట్ల వర్షం నీరు రోడ్లపైనే నిలిచిపోతుంది. దీంతో వాహనచోదకులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల పక్కన పూర్తి స్థాయిలో కాలువల నిర్మాణం జరగక వచ్చిన పరిస్థితి ఇది. చాలాచోట్ల నిల్వ నీటి కారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అంతేకాకుండా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పంచాయతీ అధికారులకు తెలియజేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

రంగంపేట: రహస్యంగా పేకాడుతున్న నలుగురు వ్యక్తుల్ని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ తోట కృష్ణసాయి శనివారం తెలిపారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో రహస్యంగా పేకాడుతున్నట్టు తమకు సమాచారం అందడంతో తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. దాడిలో నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, రెండు బైక్‌లు, రూ.1,000 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

కుతుకులూరులో..

అనపర్తి: మండలంలోని కుతుకులూరు గ్రామంలో శనివారం పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.20,520 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నిరంతరం ప్రజల ఆరోగ్యం కోసం శ్రమించే వైద్యులకు సమాజంలో రక్షణ కొరవడడం విచారకరం. కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి, అమానుషంగా హత మార్చడం దారుణమైన చర్య. దీనికి కారకులైన వారు ఎవరైనా కఠినంగా శిక్షించాలి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు వైద్యులకు రక్షణ కల్పించాలి. అప్పుడే నిర్భయంగా వృత్తిని చేయగలం.

–ఉదయ్ ఏంజిల్, పీహెచ్‌సీ వైద్యురాలు, రాజానగరం



దాడులను అరికట్టాలి



మానవ సేవే మాధవ సేవగా భావించి, వైద్య వృత్తిని చేపట్టిన వారికి సమాజం ఇచ్చే రక్షణ ఇదేనా అనే భయం వేస్తుంది కోల్‌కతా సంఘటనను చూస్తుంటే. ఎంతో మందికి ప్రాణదానం చేసే వైద్యులను నీచంగా చూడటం, వారిపై అసభ్యకరంగా దాడులకు పాల్పండం ఇటీవల కాలంలో ఎక్కువైపోతుంది. ఇకనైనా ఇటువంటి వాటిని అరికట్టాలి. వైద్య వృత్తికి ఉన్న విలువను కాపాడాలి.

–వెంకటలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, రాజానగరం

పట్టించుకుంటేనే ఆరోగ్యం

- రఘుదేవపురంలో సీహెచ్‌సీ పూర్తయ్యేనా!
- బొబ్బిల్లంకలోనూ నత్తనడకన పీహెచ్‌సీ పనులు

సీతానగరం: అందరికీ ఆరోగ్యం దిశగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది.. వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ చేరువ చేసింది.. ఇందులో భాగంగా సీతానగరంలోని పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్పు చేస్తూ రఘుదేవపురంలో కొత్త భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో గత ప్రభుత్వంలో నిధులు కూడా మంజూరయ్యాయి. ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రూ.8 కోట్లు, బొబ్బిల్లంక పీహెచ్‌సీకి రూ.2.40 కోట్ల నిధులు వచ్చాయి. ఫిబ్రవరి 24న రఘుదేవపురంలో 30 పడకల ఆసుపత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బొబ్బిల్లంకలో పీహెచ్‌సీ భవన నిర్మాణం బేస్‌మెంట్ లెవెల్‌కు చేరుకుంది. ఈ నిర్మాణాలు ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నారు. ఇప్పటికీ పనులు మొదలు పెట్టకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం త్వరతగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీహెచ్‌సీ వస్తే మెరుగైన సేవలు

రఘుదేవపురంలో సీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. పీహెచ్‌సీలో వైద్య సేవలు పొంది మెరుగైన సేవల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. సీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే స్పెషలిస్ట్ వైద్యుల సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రమాదాల్లో మృతుల పోస్ట్‌మార్టానికి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. సీహెచ్‌సీ అందుబాటులోకి వస్తే పోస్టుమార్టం, మార్చురీ కూడా ఇక్కడే అందుబాటులోకి వస్తాయి. 30 పడకల ఆసుపత్రితో 24 గంటల వైద్య సేవలు అందిస్తారు.



బొబ్బిల్లంకలో బేస్‌మెంట్ లెవల్‌కు వచ్చిన పీహెచ్‌సీ భవనం

కొత్త పోస్టులు వస్తే

సీహెచ్‌సీ వస్తే కొత్తగా 23 పోస్టులు వేస్తాయి. సివిల్ అసిస్టెంట్ సర్జన్– స్పెషలిస్ట్‌లు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఓబీజీ, పిడియాట్రిక్, అనస్థీషియా, జనరల్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్, హెడ్ నర్స్, ఆరుగురు స్టాఫ్ నర్సులు, రేడియోగ్రాఫర్, గ్రేడ్–1, 2ల ఫార్మాసిస్ట్‌లు, థియేటర్ అసిస్టెంట్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, పోస్టుమార్టం అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లు, ఆరుగురు జనరల్ డ్యూటీ అటెండర్లు, ఆఫీసు సబార్డినేట్ పోస్టులను గత ప్రభుత్వం మంజూరు చేసింది.



రఘుదేవపురంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి వేసిన శిలాఫలకం

కూటమి ప్రభుత్వం పూర్తి చేసేనా..

సీతానగరంలో దశాబ్దాల కిందట నెలకొల్పిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల ప్రజలకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. వైద్యులు, నామమాత్ర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రఘుదేవపురంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన చేయగా, బొబ్బిల్లంకలో మంజూరు చేసిన పీహెచ్‌సీ భవన నిర్మాణం బేస్‌మెంట్ లెవెల్‌కు చేరుకుంది. వీటిని కూటమి ప్రభుత్వం సత్వరమే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

మంచి పరిణామం



మండలంలో పీహెచ్‌సీ స్థానంలో సీహెచ్‌సీ రావడం హర్షణీయం. పేదలు మెరుగైన వైద్య సేవలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నెలకొల్పితే పేదలకు వైద్య సేవలపై ఎటువంటి భయాందోళన ఉండదు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా 30 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన జరిగింది. వీటిని కూటమి ప్రభుత్వ సత్వరమే పూర్తి చేయాలి.

–మట్ట శ్రీనివాస్, నాగరత్న కాలనీ, సింగవరం

నిర్మాణాలు పూర్తి చేయాలి



కొత్తగా మంజూరై నిర్మాణ దశలో ఉన్న బొబ్బిల్లంక పీహెచ్‌సీ, రఘుదేవపురంలో శంకుస్థాపన చేసిన సీహెచ్‌సీ నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయాలి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకురావాలి. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి, భవన నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా తగు చర్యలు తీసుకోవాలి.

–రంధి సుధాకర్, చినవంగలపూడి

బాలికల సంరక్షణపై అవగాహన సదస్సు



బాలికల సంరక్షణపై మాట్లాడుతున్న ఎస్ఐ రామారావు

పెదపూడి: బాలికల సంరక్షణ, చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎంఈఓ–2 సీవీవీ సత్యనారాయణ, పెదపూడి ఎస్ఐ రామారావు అన్నారు. జి.మామిడాడ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, సోషల్ మీడియా బాలికలపై ఏ విధంగా ప్రభావం చూపుతుందో అవగాహన కల్పించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలో బాలికలపై నేరాలు జరుగుతున్నాయని, వాటి నుంచి ఏ విధంగా స్వీయ రక్షణ కలిగి ఉండాలో వివరించారు. అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడికి అభినందనలు



జక్కంపూడి రాజా దంపతులను సత్కరించి, అభినందనలు తెలియజేస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దంపతులు

రాజానగరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షునిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను వివిధ జిల్లాలకు పలువురు ప్రముఖులు అభినందించారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి రాధికలు శనివారం రాజమహేంద్రవరంలోని జక్కంపూడి స్వగృహానికి వెళ్లి దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. సరైన సమయంలో సరైన వ్యక్తికి పార్టీ యువజన విభాగం బాధ్యతలను అప్పగించిన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో మైనార్టీ సెల్ ఆరీఫ్, ఇన్నీసుపేట అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ గుత్తుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కుంగిన వేంద్ర–చింతపల్లి రోడ్డు



వేంద్ర సమీపంలో కుంగిన ఆర్అండ్‌బీ రోడ్డు

పెదపూడి: మండలంలోని వేంద్ర–చింతపల్లి ఆర్అండ్‌బీ రహదారిలో వేంద్ర సమీపంలో రోడ్డు సుమారు 20 మీటర్ల మేర కుంగింది. ఈ రోడ్డులో బిక్కవోలు, జి.మామిడాడ, పెదపూడి గ్రామాల నుంచి రామచంద్రపురం వైపునకు వేల సంఖ్యలో ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకిరువైపులా కాలువలు ఉండటంతో రోడ్డు కుంగి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇప్పటికే ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయాలపాలయ్యారు. ఈ రోడ్డులో వేగంగా వచ్చే ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదవశాత్తూ కుంగిన గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



అనపర్తిలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ గణేష్, ఎస్ఐ శ్రీను నాయక్

పెదపూడి: సమాజంలో సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, సైబర్‌నేరాల నివారణపై ప్రజలకు అవగాహన అవసరమని అనపర్తి సీఐ గణేష్, ఎస్ఐ శ్రీను నాయక్ అన్నారు. అనపర్తిలో ఎంఎస్ఆర్ కాలేజీలో విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొబైల్‌లో ఓటీపీలు ఎవరికి చెప్పవద్దన్నారు. అసంబంధిత లింక్‌లు క్లిక్ చేయవద్దన్నారు. సోషల్ మీడియా వేదికగా బొమ్మలు పంపించి లైక్ చేయమని అడిగితే, లైక్ చేసిన తర్వాత ఫోన్ హ్యాక్ అయ్యే అవకాశం ఉందన్నారు. సీబీఐ అఫీసర్లమని చెప్పి భయపెట్టి నగదు తీసుకునే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరానికి గురైనప్పుడు ముందుగా 1930 నంబర్‌కు కాల్ చేసి వివరాలు చెప్పాలన్నారు. వెంటనే కాల్ చేస్తే మీ ఖాతా నుంచి ఏ ఖాతాకు నగదు వెళ్లిందో ఆ ఖాతాను హోల్డ్‌లో ఉంచే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా పోయిన నగదు తిరిగి బాధితుల ఖాతాకు జమవుతుందన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



నామవరంలోని బీవీబీలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా రాధాకృష్ణుల నృత్య ప్రదర్శన

రాజానగరం: మన సంస్కృతీ సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కలిగించడంలో భాగంగా మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఉల్లాసంగా జరిగాయి. పలువురు చిన్నారులకు కృష్ణుడు, గోపికల వేషాలు వేయించి, ఉట్టిని కొట్టించి సందడి చేశారు. నామవరంలోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన వేడుకలలో ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ శ్రీకృష్ణతత్వాన్ని గురించి వివరించారు.

అనంతరం విద్యార్థులు భక్తి గీతాలను ఆలపిస్తూ, రాధాకృష్ణుల నృత్యాలతో అలరించారు. అలాగే రాజానగరంలోని దివ్య, హర్షవర్ధన విద్యా సంస్థల్లో కృష్ణాష్టమిని ఉత్సాహ భరిత వాతావరణంలో నిర్వహించారు.

యాజమాన్య పద్ధతులతో లాభాలు



సమావేశంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మధురపూడి: ఆయిల్‌పామ్ సాగులో యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.దుర్గేష్ అన్నారు. శనివారం గాదరాడ ఓం శివశక్తి పీఠంలో జిల్లా ఉద్యాన శాఖ, పెద్దాపురానికి చెందిన పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌ఫామ్ తోటల విస్తరణ మహోత్సవం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా దుర్గేష్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో 28 వేల మంది రైతులు 19,383 హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్‌ఫామ్ సాగు చేస్తున్నారన్నారు. దీనిని మరింత విస్తృతం చేసేందుకు కార్యచరణను చేపట్టినట్టు తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో బిందు సేద్యం పద్ధతుల ద్వారా మరింత ప్రయోజనాలు పొందవచ్చన్నారు. అలాగే నాణ్యమైన దిగుబడిని సాధించడంతో పాటు, డ్రిప్ ద్వారా ఎరువులందిస్తే కూలీల ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ సందర్భంగా 32 హెక్టార్లలో విస్తీర్ణంలోని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి సంబంధించి ఆయా రైతులకు పామాయిల్ మొక్కలను పంపిణీ చేశారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి బి.సుజాతకుమారి మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు జిల్లాలోని ఈ ప్రాంతాలు అనువుగా ఉన్నాయన్నారు. పలువురు రైతులు సాగులో ఎదురవుతున్న కష్టాలను వివరించారు. కోతుల బెడద కారణంగా గెలలు నాశనం అవుతున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, పంతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థకు చెందిన అధికారులు, కోరుకొండ ఉద్యాన శాఖ మండలాధికారి పి.రినీ పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

పెదపూడి: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పెదపూడి, దోమాడ గ్రామాల్లో శనివారం ఆయన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పులతో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్య పనులు బాధ్యతగా చేపట్టాలని సూచించారు. మురుగు గుంటల్లో నీటిని, రోడ్డుపక్కన చెత్తకుప్పలు తొలగించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు. దోమల నివారణకు మందు పిచికారీ చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శులు శ్రీనివాసు చౌదరి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజానగరం: సంపత్‌నగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదు. ఈ కారణంగా భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, నామవరంలోని వినియోదార్లకు పై సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన ముఖ్యం

రాజానగరం: ఎయిడ్స్ వ్యాధి పట్ల పూర్తి అవగాహన కలిగి ఉంటే, ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కానవరంలో కోనసీమ సేవా మండలి కేర్ అండ్ సపోర్టు సెంటరులో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగిస్తూ ‘మీకు తెలుసా’ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. హెల్త్ ప్రమోటర్ కె.బేబీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఎస్‌కేవీటీ కళాశాలకు న్యాక్ బి గ్రేడ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఎస్‌కేవీటీ కళాశాలను ఈ నెల 13, 14 తేదీల్లో న్యాక్ కమిటీ సందర్శించి కళాశాలకు గ్రేడ్–బి ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబిల్ రాజబాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మెరుగైన గ్రేడ్ సాధించడం ఆయా విభాగాల అధిపతుల చేసిన సమష్టి కృషికి నిదర్శనమన్నారు. కొన్ని నెలల ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో అనుకున్న లక్ష్యాన్ని అధిగమించామని తెలిపారు. ఇక్కడ చదివిన ఎంతో మంది విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో నిలిచారని చెప్పారు. తెలుగు శాఖ చేసిన కృషిని న్యాక్ కమిటీ ప్రశంసించిందన్నారు. తాజాగా నెక్ ‘బి’ గ్రేడ్ గుర్తింపు రావడంతో విద్యార్థులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. కళాశాల అభివృద్ధికి తనపై మరింత బాధ్యత పెరిగిందని ప్రిన్సిపాల్ అన్నారు. శనివారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రేడ్ ‘బి’ని సాధించినందుకు విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి వేదసభలు

సీటీఆర్ఐ: వేదనాదంతో గోదావరి తీరం మార్మోగనుంది. ఏటా శ్రావణ మాసంలో జరిగే వేదసభలకు రంగం సిద్ధమైంది. వేదశాస్త్ర పరిషత్తు 88వ వార్షిక వేదసభ ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి ప్రాంగణంలో జరుగుతుంది. పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టా ప్రదానం, పండిత సత్కారం జరుగుతాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీఎస్ఎస్ విభీషణ శర్మ, మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాల కృష్ణ, ఎస్వీ నరసింహకిశోర్ పాల్గొంటారు.

మరిన్ని సభలు ఇలా..

స్థానిక కళాగౌతమి ఆధ్వర్యంలో డాక్టర్ బీవీఎస్ మూర్తి నిర్వహించే వేదసభ సోమవారం మధ్యాహ్నం 1 గంటకు గౌతమఘాట్‌లోని జగద్గురు పీఠంలో జరుగుతుంది. వేద పండితులు, విద్యార్థులను నిర్వాహకుడు బీవీఎస్ మూర్తి సత్కరిస్తారు. అలాగే భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న విశ్వనాథ జగన్నాథ ఘనపాఠి పేరిట ఆయన తనయుడు, మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ ఏటా నిర్వహించే వేదసభ సోమవారం సాయంత్రం 6 గంటలకు గోదావరి గట్టున ఉన్న శృంగేరీ శారదాశంకర మఠంలో జరుగుతుంది. శ్రీకొంపెల్ల సుబ్బరాయశాస్త్రి వేదశాస్త్ర పరిషత్ నవమ వార్షిక మహాసభ ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఆర్యాపురం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతుంది. రాష్ట్రపతి పురస్కారగ్రహీత విశ్వనాథ గోపాలకృష్ణ అధ్యక్షత వహించే ఈ సభను సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కొంపెల్ల సూర్యనారాయణ, కొంపెల్ల సత్యనారాయణ నిర్వహించనున్నారు. బ్రహ్మశ్రీ రేమెళ్ల సూర్యప్రకాశ శాస్త్రి వేదశాస్త్ర చారిటబుల్ పరిషత్తు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు పద్మావతీ కల్యాణ మండపం (వాడ్రేవువారి సత్రం)లో జరుగుతుంది.